# గొడ్డు

గోరింటాకు ముద్ద వేలికిచుట్టినట్టు... రొమ్ము మొనలకు వేపముద్ద చుట్టి ఉండడం ఆ మసక వెలుగులో మత్తు బరువులో అగుపించలేదు. కాంక్షా పూరితమైన కళ్లు రెప్పల్ని దించేసినా, తెరుచుకున్న పెదాలు దేవులాటలో పసిపిల్లాడిమల్లె పమిట చాటున చేరి చప్పరించబోయాయి.

"ఛీ ..." యా..క్...తుఫ్...తుఫ్..." వనజ గుండెలమీదే కాండ్రించి ఉమ్మాడు రాజారావు.

వనజ ఉలిక్కిపడింది.

లైటు వెలిగింది.

"చేదూ... చేదూ..." ఉమ్మితో నాలుకని కడిగెయ్యాలని రాజారావు చేసిన ప్రయత్నానికి ఫలితమున్నట్టు లేదు. అంతదాక ఆకాశాన్నంటబోయిన కెరటం అర్థాంతరంగా విరిగిపోయినట్టే ఉంది. తీరం చేరకుండా చెదిరిపోయినట్టే వుంది. మబ్బుల మంచం మీది నుండి అగాధంలోకి, అంధకారంలోకి జారిపడ్డట్టే ఉంది.

"నువ్వు మనిషివేనా?"

వనజ బిక్కచచ్చిపోయింది. బెదిరిపోయింది. నగ్నంగా ఉన్న దేహంమీది చర్మపు పొరను వలుస్తున్నట్టుగా ఉంది.

పట్టలేని కోపంతోనూ దిగమింగుకోలేని ఉక్రోషంతోనూ రాజారావు వనజకేసి చూస్తున్నాడు. వనజ కళ్ళెత్తి చూడలేకపోయింది. క్షణమైనా రెప్పలు పైకి లెగలేదు. సిగ్గు... అవమానంతో ఆవేదనతో అచేతనంతో అంతకంతకూ చర్మం కూరుకుపోయి... కుంచించుకుపోయిన సిగ్గు. మోయలేని సిగ్గు. చావాలన్నంత అసహ్యంతో గడ్డకట్టిన సిగ్గు.

"కడుక్కోవడము తెలీదూ..?"

దించిన కళ్ళతో వనజ తన గుండెళ వంక చూసుకుంది. "కమలా కుచకుంకుమతోనియ...." సుప్రభాతంలోలా సుందరంగా లేవు. రంగుతో ఎర్రని కుంకుమ పొద్దు పొడవలేదు. జీవితంలో ఇంకిపోయిన పచ్చదనమంతా ఒకే చోట కప్పినట్టు ఆకుపచ్చగా... చేదుగా..

"పోయి కడుక్కురా...."

వనజకు కాళ్ళూ చేతులాడ్డం లేదు. గడియారపు ముల్లో ... గుండె చప్పుళ్ళో తెలియదు...టక్...టక్...మని...

"నిన్నే...సబ్బుతో కడుక్కురా..."

విప్పిన చీర గుండెలమీద కప్పుకుంటూ అప్పుడే నడక నేర్చుకుంటున్న దాన్లా పెరటి గదిలోకి వెళ్ళింది వనజ.

"ఛీ... ఛీ..."

రాజారావు చేదుని తిట్టుకోలేదు. చేదెక్కిపోయిన జీవితాన్ని తిట్టుకున్నాడు. అమృతమని ఆశలు పెట్టుకున్నాడు. ఉమ్మి మింగాడు. విషంలానే ఉంది. ఆ విషం ఎక్కడెక్కడో పాకుతూ ఉన్నా, దాని పుట్టుకా వేగమూ జ్ఞాపకానికొచ్చేయి.

బాల్యానికి రెక్కలు మొలవడం యవ్వనం. ఊహలకు రెక్కలకు మొలవడం యవ్వనం. రెక్కలొచ్చినా రెక్కల్లో సత్తువలేదు. ఎంత ఎగురుదామన్నా ముప్పై ఏళ్ళు నిండాయి. ఉద్యోగమొచ్చింది. వచ్చాక పెళ్ళి వయసూ వచ్చింది. పెళ్లామూ వచ్చింది. ఆరిపోయిన ఆశల్ని తీసి నాన బెట్టాలనుకున్నాడు. ఉరేసుకు చచ్చిపోయిన ఊహల్ని తీసి పెళ్ళి పల్లకీలో ఊరేగించాలనుకున్నాడు. మొలకలేస్తున్న సంసార వృక్షాన్ని మొక్కగానే ఉండగ - లేత ఆకులు రానీ... రెమ్మలు రానీ... కొమ్మలు కానీ... పూలు పూయనీ... ఆ తర్వాతే 'పంట'నీ ఏవేవో అనుకున్నాడు. ఆశించాడు. ఆ ఆశతోనే అత్యాశగా అయిదేళ్ళు "పిల్లలు వద్దు" అనుకున్నాడు.

రబ్బరు తొడుగు రక్షణ కవచం కాలేకపోయింది. ఎంత ఇరుకయినా కృత్రిమత్వానికీ ప్లాస్టిక్ పూలకీ చోటులేకపోయింది. 'పిల్లలు పుడితే ప్రేమ తగ్గిపోదమో... తరలిపోవడమో' ... జరుగుతుందని భయపడ్డా, జరగక తప్పింది కాదు.

పండక్కి పెళ్ళి..మళ్ళీ పండక్కి ముందే బిడ్డ. సరేలే పాలిచ్చినన్నాళ్ళూ ప్రాణంమీదికి

వచ్చింది లేదని అనుకుంటే అయిదో నెల తిరగలేదు మూడో నెలని తేలింది. అబార్షన్ అయి అనారోగ్యమూ అయినా, అక్కడికో ఏడాదిన్నరకే... మళ్ళీ.. సరేలే. ఆపరేషనయ్యాక అంతా మనదే అనుకున్నాడు. పురిటిలోనే ఆపరేషను. అది వనజకే...

ఇదిగో ఇప్పుడు ఈ తొమ్మిది నెలలకి పురిటి వాసన ఉన్నా పుట్టిళ్ళు వదిలి వచ్చింది. ఉమ్మడి కుటుంబాల గడపదాటలేక, ఇరుకు గోడల్ని ఎడంగా జరపలేక, ఏడ్చే పిల్లల్ని ఓదార్చలేక.. అలసట వచ్చేసింది. అనాసక్తతా వచ్చేసింది. జీవితమ్మీద విరక్తీ వచ్చేసింది.

ఇన్నాళ్ళకు ఒంటరి ఏకాంతం...

అర్ధరాత్రికి అరగంటముందే అరచి గీపెట్టిన పిల్లలిద్దరూ పడుకున్నారు. అలికిడయితే చాలు లేస్తారని ఊపిరితీయడం మానుకున్నట్టు బిగబట్టి ఒకర్నొకరు కప్పుకుందామంటే...

"ఛీ..."

రాజారావు నోరు కడుక్కోకుండానే పంచదార రెండు చెమ్చాలు నోటిలో పోసుకొని వచ్చి మళ్ళీ మంచమెక్కాడు.

వనజ చెప్పిన పని చేసొచ్చి కదులుతున్న పిల్లల్ని జోకొట్టింది. గడియారం ఒంటిగంట కొట్టింది.

ఉమ్మితో పంచదారను చప్పరించి మింగుతున్నా, చేదూ తీపి కలిసినట్టు ఉందేగాని తీయని తీపిదనం దక్కలేదు రాజారావుకి.

ఎంత కడుక్కున్నా చేదుముద్దలు గుండెమీద ఉన్నట్టే బరువుగా భ్రమగా తోస్తోంది వనజకి.

నిశ్శబ్దం...

గుండెల్లో భీకర తుఫానులు ఉన్నా ప్రశాంతమైన నిశ్శబ్దం..

"ఎంత పనులు ఉన్నా... అంత మతిమరుపయితే ఎలాగ.. చెప్పొచ్చుగా ..." వనజ భుజం మీద చెయ్యివేసాడు రాజారావు.

"మతిమరుపు కాదు, కావాలనే..." అని అనాలనుకుంది వనజ, కాని నోరు విప్పలేక పోయింది.

లైటు ఆరింది.

బెడ్‌లాంప్ వెలుగు మసకగా...

"వసూ.." పిలుపులో స్పష్టత లేదు. చచ్చిన కోరిక తలెత్తి కొద్దిగ కొద్దిగ చేదుని మింగుతూ...

"పిల్లలు లేస్తారు..." ఇష్టమయినా మనసు కష్టంతోనే చెప్పింది వనజ.

"కింద చాప వేసుకుందాం.."

రాజారావు మంచం దిగాడు. వనజ దిగక తప్పలేదు.

చెవి తమ్మెలు..చెంపల కెంపులు..కంఠనాళం.. పక్కభాగం... ఒకటొకటీ దాటుతూ ఊపిరిగాలి దారి చూపుతుంటే నాలుక నర్తిస్తూ దారి చేసుకుంటోంది. ఊపిరి గాలికి రెండు రొమ్ములూ తలలెత్తాయి. పెదవులు విచ్చుకొని నాలుక వ్యాకోచిస్తూ సంకోచిస్తూ...

ఎంత కూడదనుకున్నా కూడదీసుకున్నా శరీరంలో సహజమైన వాంఛ.. ఇన్నాళ్టిలా కడుపెక్కడొస్తుందో నన్న బితుకూ బెంగా లేని స్వేచ్ఛాపూరిత వాంఛ... కామపూరిత వాంఛ.

వనజ శరీరం లతలా, ఎటుబడితే అటు పాకింది.

రాజారావు తీగెలు సవరిస్తూ ఉన్నాడు.

కెరటాలు అందనంత ఎత్తుకు ఎగబాకాయి!

వనజ రొమ్ములు సేపుతూ...పాలు తన్నుకొస్తూ.. ఇంకిపోయి ఇగిరిపోయినవి అనుకున్న పాలు బుక్కెడూ గుక్కెడూ.. అతడు గుక్కెట పట్టి మింగాడు.

వనజ శరీరం ఒక్కసారి చల్లబడిపోయింది. కెరటం ఆనందాంచుల్ని తాకకముందే చప్పబడిపోయింది.

భీతావహమైన భయం ఆమె కోర్కె వెన్నువిరిచేసింది.

విరిగిన చప్పుడు రాజారావుకి వినిపించలేదు. చూడడానికయినా సరే కనిపించనిదది. అతడ్ని దూరంగా తోద్దామనుకుంది. కాని ఆ పని చేయలేకపోయింది. ఆ చేయలేని క్షణాల్లో అతడు అనంతమైన... అవధులు లేని తీరాల్ని చుట్టి వచ్చి తృప్తిగా అలసిపోయాడు. అలాగే ఆమెవంటి మీద సేదతీరుతూ చారగిలబడ్డాడు.

ఏడుపు...!

వనజ కొచ్చిన దుఃఖమంతా, ఎగబాకిన ఏడుపంతా పసిబిడ్డ అందిపుచ్చుకొని రోదిస్తూ...నిద్రలోంచి లేస్తూ....

చిరాకుగా రాజారావు తప్పుకున్నాడు.

వనజ బట్ట చుట్టుకొని వెళ్ళి బిడ్డని జోకొట్టబోయింది. ఫలితం లేదు. ఏడుపు ఎక్కువయింది. బిడ్డని తీసి ఎత్తుకుందామె. ఇంకా ఫలితం లేదు. ఏడుపు అంతకంతకూ ఎక్కువయ్యింది.

లాలించినా బుజ్జగించినా.. ఏం చేసినా ఏడుపు తగ్గలేదు.

నిశ్శబ్దం బద్దలయిపోయింది. ఊరుని లేపేసే రొద...

"ఆకలేమో..." రాజారావన్నాడు.

లైటు వెలిగింది.

వంటగదంతా కలియదిరిగాడు రాజారావు. అతని చేతికి ఏమీ దొరకలేదు. దొరికిన సిర్లాకు డబ్బాలు.. నెస్టమ్ పేకట్లు. అమోల్ స్ప్రే డబ్బాలు.. అన్నీ కూడా వట్టిపోయి ఖాళీగా ఉన్నాయి. బిడ్డకోసం పాలడబ్బా తీసుకురమ్మన్న వనజ మాటలు గుర్తుకొచ్చాయి.

"పాలడబ్బా ఏదీ లేదా..." అడగలేకపోయాడు రాజారావు. వంటగదిలోంచి ఇవతలకు రాలేకపోయాడు. ముఖం చెల్లనివాడిలా దాక్కున్నాడు.

వనజ భర్తని గమనించింది.

బిడ్డ దేన్నీ గ్రహించే స్థితిలో లేదు. అందుకే అర్ధరాత్రి అలారంలా అలా ఏడుస్తూనే ఉన్నాడు.

'సిర్లాకు నాలుగురోజులే వచ్చిందా?...' వినీ వినిపించనట్టు రాజారావు అన్నా, వనజాకామాట వినిపించింది.

ఆ సమయంలో వనజ ఇవ్వాల్సిన సమాధానం ఇవ్వకపోయినా, పాత సమాధానం ... ప్రతిరోజూ సమాధానం... అనకపోయినా అన్నట్టుగా వినిపించింది.

"పది నెలలబాబు, రోజుకి మూడు పూటలు.. పలచన చేస్తే ఆగదు, ఆకలి తీరదు. మళ్లీ పట్టిందాక గోలే..."

ఖాళీ డబ్బాలవంక అలాగే చూసాడు రాజారావు. ఎందుకనో లెక్క పెట్టాడు. నెలకు నాలుగయిదుకు తక్కువ కాదు. అంటే రెండొందలు పైనే. పాలు నూటయాభై. మందులూ టానిక్‌లూ రెండొందలు.. ఆరొందలకు తక్కువకాని అదనపు ఖర్చు...

అదీ ఇదంతా ఒక్క బిడ్డకే...

రెండో బిడ్డకో?!...

ఏమయినా లెక్కలు వేసుకుంటే సగం జీతం పిల్లలకి, సగం జీతం సంసారానికి. తప్పితే సమస్యలు తీరవు. ఫస్టు తేదీకి గాని కొన్నయినా నెరవేరవు. ఫస్టు తారీఖుకు కొన్ని నెరవేరినా మరెన్నో మిగిలిపోతాయి. మిగిలినవన్నీ అప్పులవుతాయి. వడ్డీలు మిగులుతాయి. వడ్డీలకు మళ్ళీ అప్పులు పుట్టి పెరుగుతాయి.

"అప్పుడు పిల్లలకి ఇవ్వన్నీ లేవు... రొండు పాలుగీరుకొని... ఇంతరవ్వ అంబలి వడగట్టి పట్టిసినా వల్లకుండోరు....." ముసలమ్మ బాధ. అంబలి, చోడిపిండిని తయారుచేసి, వడగట్టి పట్టబోతే విరోచనాలు. సొంటిగొమ్ముకి, వేపాకుకి లొంగలేదు.

"కాలం తెల్లమీరిపోయింది, ఆ కాలంతో పూపేసు కుంటే కాదు. అయినా కల్తీ పంట.... కల్తీ తిండి.. కక్కుర్తి పడినా కడుపు దక్కదు..." ముసలాయన వ్యథ.

"లోకంలో ఎక్కడా లేదు ఈ తీరవ. నా కొడుకు బతుక్కొచ్చింది అగ్గి. కాపోతే పదినెల్లుకి పాలు సాలక పోడమేటి? లేకపోడమేటి?" అత్తమాట.

"మనిషంత ఎండుగున్నా, 'గుండెలు' లేనిదాయి కాదు, నింపుగా పెద్ద గుండెలదాయే. కానేటో...?" ఇరుగమ్మ సానుభూతి.

"పొదుగుచూసి ములిగిపోవడమంటే ఇదే.." - మాట అనకపోయినా సరే, వచ్చే అర్థం... తేలే గూడార్థం ఇదే!

ఆ పొదుగు చూసే.. గుండెలు చూసే... రాజారావు వనజని ఇష్టపడ్డాడు. అదే ప్రధానకారణం అనకపోయినా ఒక కారణంగా చెప్పక తప్పదు. కనిపించే అందాల్లో అదో అగ్రభాగమయిన అవయవం. ముప్ఫైఆరు-ఇరవయ్యారు-ముప్ఫైఆరు- కొలతలు పెళ్ళికి ముందరే ఊహించి మిత్రులతో లెక్కలు వేసికొన్నవి. దక్కాక తన్మయత్వంతో ఉబ్బితబ్బిబ్బయి పోయాడు. తీరా 'ప్రయోజనం' దగ్గరకు వచ్చేసరికి కొలతలు తను వేసుకొన్న లెక్కలకి సరిపోనట్లే ఉంది!

సరిపోవాలంటే...సొష్టవంగా ఉండాలంటే పోషక పదార్థాలు కావాలి. పాలు, గుడ్లు, పప్పులూ, కూరగాయలూ లాంటి బలవర్ధక పదార్ధాలు తినాలట. కాని అత్తమామలూ, ముసలాళ్ళూ, మరుదులూ, భర్తా తినగా ఆఖర్న (ఉంటే) తినాలి. ఇది సంసారపు ఇల్లాలికి లక్ష్మణరేఖ!

ఆ గీతా దాటలేకపోయింది వనజ.

అప్పటికీ బియ్యం కడిగిన పసగడుగు నీళ్ళూ, ఎసర పొంగుతున్నప్పుడు తీసిన తేటగెంజీ... పుల్లటిగెంజీ కంచంతో కాక అరచేతిలో ఎత్తి దోర్సుకొని తాగినా పెద్దల మాటతో - వైద్యంతో... లేని రోగం మానిపోలేదు.

"ఊ...ఆ...." ఏడ్చి ఏడ్చి గుక్కపట్టాడు బిడ్డ.

అది భయంకరమైన నిశ్శబ్దం...

అలాగే ఏడుపుతో ఊపిరి ఆగిపోగలదనిపించి, దగ్గరగా వచ్చి 'చూడు' అన్నాడు. అంతకంటే ఏమనాలో రాజారావుకి తెలీలేదు.

కొద్దిసేపటికి బిడ్డగొంతు మళ్ళీ వినిపించింది.

మూసిన తలుపు తెరుచుకుంది. ఇంట్లోని వారందరూ లేచిపోయినట్టే ఉన్నారు. "బార్లీ ఇంద... ఒక రవ్వ పట్టిమీ..." అత్తగిన్నెతో అందించింది.

వనజ ఆ తేటనీటిని గోకుర్లో వేసి బిడ్డ నోట్లో పోసింది. క్షణాల్లో తాగేసి...కొద్ది క్షణాలే ఆగి..మళ్ళీ ఏడుపందుకున్నాడు.

"పాలు పెట్టు...రాకపోయినా ఏడుపాపుతాడు" అత్తమాట.

వనజ బిడ్డని ఒడిలో నిడుకొని తలని పైటమాటుకు చేర్చుకుంది. ఆ చిన్ననోరూ లేతచేతులూ వెతుకులాడి రొమ్ముని అందుకోవడంతో ఏడుపు ఆగిపోయింది.

నిశ్శబ్దం...

ఎముకల్లోంచి మూలుగును పీల్చుతున్నట్లే రొమ్ము మొనల రంధ్రాల్లోంచి రక్తాన్ని పీల్చుతున్నట్టు...

వనజ తన్మయత్వంతో కాక తాళలేనట్టు కళ్ళుమూసుకుంది.

రాజారావు దోషిలా దించిన తల ఎత్తడం లేదు.

"బుడుమూరోల కోడలు తనకి చేతిని పిల్లున్నా, కడా ఇంటి కణితోల మనవడికీ పట్టేది పాలు... ఎత్తి ముంచీసివి....ఇదేమి సిత్రమో ఈ ఇంట్ల...' అత్త వెళుతూ తలుపు మూసుకుని పోయింది.

రొమ్ము మార్చింది వనజ. అయినా బిడ్డకి అందాల్సింది దొరుకుతున్నట్టు లేదు. దవడలు నొప్పెట్టిందాక అదేపని... మధ్య మధ్యలో ఆగుతూ ఉన్నా అదే చప్పుడు ఆ నిశ్శబ్దాన్ని బద్దలు చేస్తూ...

మనసు మొద్దుబారిపోయినప్పుడు శరీర సహనానికి కొలమానం లేదు. వనజ భరిస్తూ ఉంది. సహించలేని బిడ్డే వచ్చీరాని పళ్ళతో చిటుక్కున పంటిగాటు...నునుపైన మొనలమీద ముళ్ళు దిగబడినట్లు...

"అమ్మా..." వనజ పెదాలు ఆ మాటని అదిమి పట్టలేకపోయాయి. అప్రయత్నంగా బిడ్డని వెనక్కిలాగి ఒక్క దెబ్బకొట్టింది.

ఏడుపు...!

"నీకేమయినా మతిపోయిందా?"

రాజారావు ఆ మాటని అని వనజ వేపు చూసాడు. వనజ రొమ్ము మీది రక్తపు జీరని తుడుచుకుంటూ ఉంది.

రాజారావుకి అసహ్యం కలిగింది. ఆ అసహ్యంలోంచి కోపం పుట్టింది. తనని చేతకాని తనంతో అచేతనం చేసిన శక్తులూ ..ఏమీ గుర్తుకు రాలేదు. తన తల్లి అన్నమాటలు గుర్తొచ్చి కొంత బలమొచ్చి ఆలోచనలు ఎటెటోపోతున్నాయి.

"మన పల్లెటూళ్ళంట బడిలోకెల్లిన దాకెడతారు. నువ్వు సంవత్సరానికే "వట్టిపోనావు". తిన్నదంతా ఎక్కడెట్టేస్తున్నావ్?"

ఎక్కడ తగలరాని చోట తగిలితే - గునపం దిగినట్టు గిలగిల లాడిపోతారో, సరీగ అక్కడే వనజకూ తగిలి విలవిలలాడిపోయింది.

వనజ తలెత్తి చూసింది.

ఆ చూపు రాజారావు కళ్ళలోకి చొరబడింది.

"నాకు చాలినంత తిండిపెట్టు."

"నాకు పాలుకావడానికి ఇంజక్షన్ చేయించు..."

"నేను పశువును కాదు, నీకూ నీ బిడ్డకి చాలినన్ని పాలు ఇవ్వడానికి".

"నేను మనిషిని.... ఆడదాన్ని"

వనజ అరుస్తున్నట్టో.. ప్రశ్నిస్తున్నట్టో..రోదిస్తున్నట్టో... చెప్పాలని అనుకుంది. కాని ఒక్క మాటా పైకి రాలేదు. అవన్నీ కూడా తీక్షణమైన చూపులో కలగలసిన ప్రవాహమైనట్టు మటుకు ఉంది.

రాజారావు తల దించేసాడు. గుటకలు మింగాడు. ఉమ్మితడి ఆరిపోయినా చేదుమింగలేనట్టే ఉంది. మింగలేక దిగమింగుతున్నట్టే ఉంది.

వనజ కళ్ళలో నీళ్ళు... పాలింకిపోయినట్టు ఇంకిపోలేదు. బొటబొటమని జారి చెంపలమీది నుండి రొమ్ములమీదగా...

రాజారావు వనజ కాళ్ళ దగ్గర కూలబడ్డాడు. ఏమాటా అనకపోయినా 'నన్ను క్షమించు' అన్నట్టే ఉంది. తప్పు చేసాను అన్నట్టే ఉంది. తీరని కోరికల ముందు... వాటి ఉధృతం ముందు... పరుగులెట్టి... చేసిన పనికి ప్రాయశ్చిత్తం కోరుతున్నట్టే ఉంది. ఒకరి ఆకలి తీరితే మరొకరి ఆకలి తీరనట్టూ అర్ధమయింది.

వణుకుతున్న గొంతుతో 'వసూ' అన్నాడు రాజారావు. అంతలోనో వెక్కి వెక్కి ఏడ్చాడు. కుళ్ళి కుళ్ళి ఏడ్చాడు,

వనజ భర్తనీ బిడ్డనీ, మండుతున్న గుండెలమీదికి లాక్కొని ఓదార్చే ప్రయత్నం చేసింది.

ఎటొచ్చీ వనజనే ఓదార్చేవాళ్లు లేరు!

*రచన : 25 -12-'94*

*ప్రచురణ : ఆహ్వానం, ఫిబ్రవరి 1995*